# మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయం

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- 4విడత ఆసరా కింద 823 సంఘాలకు రూ.5.29 కోట్లు మంజూరు
- టీడీపీ సాధ్యంకాని హామీలను నమ్మి మోసపోకండి
- పొదుపు మహిళలకు ఆసరా మెగా చెక్కును పంపిణీ



ఆసరా మెగా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



సభకు హాజరైన పొదుపు మహిళలు

**ఓర్వకల్లు :** రాష్ట్రంలోని ప్రతి మహిళ ఆర్థికంగా ఎదగాలన్నదే ప్రభుత్వం ధ్యేయంగా పెట్టుకున్నట్లు వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఐక్య సంఘం కార్యాలయం వద్ద ఎంపీడీఓ మల్లీశ్వరి అధ్యక్షతన 4వ విడత ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ.. 2014 ఎన్నికల సమయంలో పొదుపు రుణాలు రద్దు చేస్తామని, బ్యాంకుల్లో తాకట్టుపెట్టిన బంగారాన్ని ఇళ్లకు తెప్పిస్తామని హామీలు ఇచ్చి చివరకు చేతులు ఎత్తేసిన చరిత్ర చంద్రబాబుదన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు మహిళలకు ఇచ్చిన హామీల మేరకు దశలవారీగా ఆసరా పథకంతో మహిళల బ్యాంకు రుణాలను మాఫీ చేశారన్నారు. ఆసరా పథకం ద్వారా మండలానికి ఈ ఒక్క ఏడాదిలోనే 873 పొదుపు సంఘాలకు రూ.5.29 కోట్లు రుణాలు చెల్లించడం హర్షించదగ్గ విషయమన్నారు. గత నాలుగేళ్ల కాలంలో మొత్తం రూ.21.30 కోట్ల మేర రుణమాఫీ చేశారని చెప్పారు. చంద్రబాబు పాలనకు, జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు మధ్యగల వ్యత్యాసాలను ప్రతి అక్కాచెల్లెమ్మలు గుర్తించాలని కోరారు.

**డీబీటీ, నాన్‌డీబీటీల ద్వారా రూ.4లక్షల కోట్లు ఖర్చు**

మహిళల ఆర్థికాభివృద్ధి కోసం డీబీటీ, నాన్‌డీబీటీల ద్వారా గత నాలుగేళ్లలో దాదాపు రూ.4లక్షల కోట్లు ఖర్చు చేసినట్లు ఎమ్మెల్యే అన్నారు. పేద విద్యార్థులకు సైతం ఇంగ్లిష్ మీడియం చదువుకునే అవకాశం కల్పించిన గొప్ప మనస్తత్వం జగనన్నదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం విద్యను రద్దు చేయాలని టీడీపీ వారు కోర్టుకెళ్లారని చెప్పారు. ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అమలు చేసి, పారదర్శకమైన సుపరిపాలన అందిస్తున్న వైఎస్సార్‌సీపీని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. అనంతరం ఆసరా మెగా చెక్కును మహిళలకు అందజేయగా.. పొదుపు మహిళలు జగనన్న చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కర్నూలు మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ తిప్పన్న, జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు, సర్పంచు నాగేశ్వరమ్మ, సింగిల్ చైర్మన్లు చంద్రశేఖర్‌రెడ్డి, నాగతిరుపాలు, జేసీఎస్ మండల కన్వీనర్ లోటర్‌బాషా, మండల మహిళా సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు విజయలక్ష్మి, తైమున్నిషా, ఏపీఎం వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**నిరుపేద విద్యార్థులకు ఆర్థిక సాయం**

నిరుపేద విద్యార్థుల చదువును ప్రోత్సహించేందుకుగాను గ్రామానికి చెందిన మండల ఉపాధ్యక్షులు తిరుపంరెడ్డి జ్ఞాపకార్థం ఆయన సతీమణి లక్ష్మీకాంతమ్మ, కుమారుడు నాగేంద్రారెడ్డి ఆర్థిక సాయం అందజేశారు. గ్రామంలోని 11 మంది పేద విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున గత రెండేళ్లుగా వారి బ్యాంకు ఖాతాలలో డిపాజిట్ చేయడం జరుగుతోంది. ఈ మేరకు బ్యాంక్ డిపాజిట్ పత్రాలను ఎమ్మెల్యే కాటసాని చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. వారి సాయం పట్ల ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారు. అదేవిధంగా సచివాలయం, రైతు భరోసా కేంద్రాల నిర్మాణాలకు స్థలాన్ని విరాళంగా ఇచ్చి దాతృత్వం చాటిన సింగసాని కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నటరాజ్, ఎంపీడీఓ మల్లీశ్వరి, ఎంపీటీసీ సభ్యురాలు నాగశిరీష స్థానిక నాయకులు ప్రభాకర్‌రెడ్డి, రాజేశ్వరరెడ్డి, వీరభద్రారెడ్డి, వెంకటస్వామి, జేసీఎస్ మండల కన్వీనర్ లోటర్‌బాష, మండల ఉపాధ్యక్షులు పద్మనాభరెడ్డి వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**సచివాలయ వ్యవస్థతోనే పారదర్శక పాలన**

రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థతోనే ప్రజలకు పారదర్శకమైన పాలన అందుతుందని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని లొద్దిపల్లె గ్రామంలో నూతనంగా రూ.70 లక్షలతో నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను ప్రారంభించారు. అనంతరం గ్రామ సర్పంచు పుష్పమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం జగనన్నతోనే సాధ్యమైందన్నారు. గ్రామస్థాయిలోనే ప్రజలకు సంక్షేమ ఫలాలు అందజేయడం జరుగుతుందన్నారు. సచివాలయ వ్యవస్థతో పాటు వలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చి ప్రజల వద్దకే పాలన అందజేస్తున్న ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అన్ని రకాల వ్యవసాయ సేవలను గ్రామంలోని అందజేస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా పల్లెచెంతకే ఆరోగ్య సేవలను అందుబాటులోకి తెచ్చామన్నారు.



లొద్దిపల్లెలో హెల్త్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

## పంట నమోదు చేయించుకోవాలి



వెంకటగిరి రైతు భరోసా కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ రవిప్రకాష్

**కోడుమూరు రూరల్ :** రబీ కింద పంటలు సాగు చేసిన ప్రతి రైతు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని ఏఓ రవిప్రకాష్ సూచించారు. మండలంలోని వెంకటగిరి, అమడగుంట్ల గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలను మంగళవారం ఏఓ రవిప్రకాష్ తనిఖీ చేశారు. కార్యాలయ రికార్డులను పరిశీలించడంతో పాటు, రైతులతో సమావేశమై పంటల సాగు, దిగుబడులపై చర్చించారు. ఏఓ మాట్లాడుతూ రబీ కింద సాగు చేసిన ప్రతి పంటను రైతులు యాప్‌లో నమోదు చేయించుకోవాలని, ఈనెల 15వతేదీలోపు ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. పంట నమోదు, ఈకేవైసీ ఉంటేనే రైతులకు ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని ఏఓ సూచించారు.

## విశ్వకర్మ ఇంప్లిమెంటేషన్ కమిటీలో జిల్లా వాసులు

**కర్నూలు కల్చరల్:** ప్రధాన మంత్రి – విశ్వకర్మ కర్నూలు జిల్లా ఇంప్లిమెంటేషన్ కమిటీ సభ్యులుగా పలువురు జిల్లా బీజేపీ నాయకులు నియమితులయ్యారు. కాళింగి నరసింహ వర్మ, అంబలి కాశీ విశ్వనాథ్, మలేకర్ శ్రీనివాసులును నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకం అమలు తీరుతెన్నులను వారు పర్యవేక్షించనున్నారు.

## క్లుప్తంగా

### గురుకుల పాఠశాల పరిశీలన



కలెక్టర్‌ను కలసిన ఐటీడీఏ పీఓ రవింద్రారెడ్డి

**పాణ్యం :** మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో స్ట్రాంగ్‌రూం ఏర్పాటు నిమిత్తం మంగళవారం జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు పరిశీలించారు. పాఠశాలలోని రూమ్‌లు, సౌకర్యాలపై ఆరా తీశారు. ఎన్నికలకు సంబంధించి ఈవీఎంలను భద్రపరిచేందుకు గదులు అనుకూలంగా ఉన్నాయా? లేదా అనే అంశంపై ఆరా తీశారు. అంతకు మునుపు కలెక్టర్ కార్యాలయంలో పీఓ రవింద్రారెడ్డి జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందించారు.

### ప్రతి కూలీకి కనీస వేతనం అందాలి



భూపనపాడు గ్రామంలో పనులు పరిశీలిస్తున్న సురేంద్రకుమార్

**పాణ్యం:** ఉపాధి హామీ పథకంలో పనిచేసే ప్రతి కూలీకి కనీస వేతనం అందాలని అంబుడ్స్ పర్సన్ సురేంద్రకుమార్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని భూపనపాడు గ్రామంలో ఉపాధి పనులను పరిశీలించారు. కూలీలతో మాట్లాడి గ్రామంలోని జరుగుతున్న పనులపై, వారికి చెల్లించే వేతనాలపై ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ పనులకు తగిన కొలతలు ఇవ్వాలని, ఉద్యాన పంటను ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ విజయరాణి తదితరులు పాల్గొన్నారు.

### అమ్మవారికి ఎమ్మెల్యే పూజలు



పూజ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

**కల్లూరు:** మండల పరిధిలోని ఉలిందకొండలో గ్రామదేవర సందర్భంగా మంగళవారం పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుంకులమ్మ, నాయకులు రమణారెడ్డి పాల్గొన్నారు.

### నేడు దక్షిణామూర్తి విగ్రహ ప్రతిష్ఠ

**గూడూరు:** పట్టణంలోని భువనేశ్వరీ మాత, నీల కంఠేశ్వర స్వామి ఆలయంలో బుధవారం దక్షిణామూర్తి విగ్రహ ప్రతిష్ఠ నిర్వహిస్తున్నట్లు పూజారి మిన్నెప్ప తెలిపారు. విగ్రహ ప్రతిష్ఠ అనంతరం అన్నదానం ఉంటుందని, భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారి కృపకు పాత్రులు కాగలరని ఆయన కోరారు.

### పూర్వవిద్యార్థికి సన్మానం



ఉపాధ్యాయుడు బషీర్‌బాషాను సన్మానిస్తున్న హెచ్‌ఎం, సిబ్బంది

**పాణ్యం:** మండల పరిధిలోని మద్దూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి సమీర్ ఉసేన్‌ను, భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు బషీర్‌బాషాను మంగళవారం హెచ్‌ఎం శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయ సిబ్బంది సన్మానించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ.. నంద్యాలలోని ఎస్టీ జోసఫ్ స్కూల్ నందు ఈనెల 11–12 తేదీల్లో జరిగిన జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో తమ పాఠశాల పూర్వవిద్యార్థి ప్రస్తుతం నంద్యాలలో ఇంటర్ చదువుతున్న సమీర్ ఉసేన్ ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపికయ్యాడన్నారు. అతనికి ఉపాధ్యాయుడు బషీర్‌బాషా గైడ్‌గా వ్యవహరించారని, తెలుగు ఉపాధ్యాయుడు వెంకట్, జీవశాస్త్ర బోధకుడు సురేష్ సహాయసహకారాలు అందిచారన్నారు.

### తపాలా పొదుపు పథకాలపై అవగాహన

**పాణ్యం :** మండల పరిధిలోని ఆలమూరు గ్రామంలో తపాలా శాఖ చిన్న పొదుపు ఖాతాలపై నంద్యాల సబ్ పోస్టల్ డివిజన్ ఏఎస్‌పీ సత్యనారాయణరావు అవగాహన కల్పించారు. మంగళవారం పాణ్యం సబ్‌పోస్టుమాస్టర్ బీపీఎం, ఏబీపీఎంల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆడపిల్లకు సుకన్య సమృద్ధి యోజన పథకం ద్వారా 8.2శాతం వడ్డీని అందిస్తున్నామన్నారు. అలాగే రూ. 250 మొదలు కొని ఖాతాను ప్రారంభించుకోవచ్చని చెప్పారు. నెలనెలా రూ.100ల నుంచి రికరింగ్ డిపాజిట్ చేసుకుంటే మంచిదన్నారు. సమీపంలోని పోస్టాఫీసులో వద్దకు వెళ్లి పథకాల గురించి తెలుసుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో సురేష్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికలకు సమాయత్తం కావాలి



మాట్లాడుతున్న కాటసాని శివనరసింహారెడ్డి

**పాణ్యం :** 2024 సార్వత్రిక ఎన్నికలకు సమాయత్తం కావాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు కాటసాని శివనరసింహారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం పాణ్యంలోని పార్టీ కార్యాలయంలో నాయకులతో ముఖాముఖి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో క్షేత్ర స్థాయిలో ప్రతి నాయకుడు, కార్యకర్త ప్రభుత్వం, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి గురించి ప్రజలకు తెలియజేయాలన్నారు. అలాగే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధిపై ప్రజలకు అవగాహన కల్పించాలరు. 2019లో ఫలితాలే పునరావృతం కావాలని చెప్పారు. అనంతరం నాయకులతో మాట్లాడిన వారి కష్టనష్టాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉసేన్‌బీ, మాజీ సర్పంచ్ సుబ్బరాయుడు, ఉప సర్పంచ్ పాలం చంద్రశేఖర్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు జాకీర్, ఆటోమాబు, కృష్ణమూర్తి, ఉసేన్‌బాషా, బొజ్జన్న, చికెన్‌వలి, నూర్, ఎల్లకిట్టు, రోషన్, గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోండి



సంగాలలో హెల్త్ క్యాంప్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శకుంతల

**సి.బెళగల్:** ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ శకుంతల సూచించారు. మంగళవారం సి.బెళగల్ మండలంలోని సంగాల గ్రామంలో మండల అధికారులు, వైద్యులు ఏర్పాటు చేసిన రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేక హెల్త్ క్యాంప్‌ను ఎంపీడీఓ ప్రారంభిచారు. ఈ సందర్భంగా ఆమె హెల్త్ క్యాంప్‌లోని అధికంగా నమోదవుతున్న ఆరోగ్య సమస్యలను వైద్యులు అడిగి తెలుసుకున్నారు. ఈసీజీ, కంటి పరీక్షలతో పాటు ఇతర వైద్య పరీక్షల తీరును పరిశీలించి వైద్య సిబ్బందికి సూచనలు చేశారు. అదే విధంగా వైద్య పరీక్షలు, డాక్టర్ల సిఫార్సుల మేరకు అవసరమైన వారికి ఉచితంగా మందులను ఎంపీడీఓ డాక్టర్లతో కలిసి పంపిణీ చేశారు. హెల్త్ క్యాంప్‌లో 376 మందికి వైద్య సేవలు అందించినట్లు డాక్టర్ మిథున్‌కుమార్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు ప్రసాద్‌రెడ్డి, సింధూర, వాసు, కంటి వ్యాధి నిపుణుడు సంపత్, వైద్య అధికారులు ఉమామహేశ్వరి, మంగమ్మ, మద్దిలేటి, పంచాయతీ కార్యదర్శులు ముస్తక్ అహ్మద్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## పథకాల అమలులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

**సి.బెళగల్:** ప్రభుత్వ పథకాల అమలులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ శకుంతల సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లను హెచ్చరించారు. మంగళవారం ఆమె మండలంలోని సంగాల గ్రామ సచివాలయంలో ఉద్యోగులు, వలంటీర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కులగణన, ఆరోగ్యశ్రీ యాప్ డౌన్‌లోడ్, నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ల నివేదికలను పరిశీలించి ఉద్యోగులు, వలంటీర్ల తీరుపై మండిపడ్డారు. ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణలో అలసత్వం వహించరాదని, మరోసారి విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే తప్పకుండ చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అదేవిధంగా మండల పరిధిలోని పలుకుదొడ్డి గ్రామ ప్రాథమిక పాఠశాలను ఎంపీడీఓ శకుంతల తనిఖీ చేశారు. జగనన్న గోరుముద్ద అమలు తీరుపై ఆరా తీశారు. విద్యార్థుల విద్యా ప్రగతిని స్కూల్ హెచ్‌ఎం హనుమంతును అడిగి ఎంపీడీఓ తెలుసుకున్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ముస్తక్ అహ్మద్, శ్రీనాథ్, ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

## నేడు కరిమద్దెలలో భవనాల ప్రారంభోత్సవం



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న విలేజ్ హెల్త్ క్లినిక్

**గడివేముల:** మండల పరిధిలోని కరిమద్దెల గ్రామంలో వివిధ అభివృద్ధి పనులను మంగళవారం పాణ్యం ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు మండల వ్యవసాయ కమిటీ చైర్మన్ పుల్లయ్య సోమవారం తెలిపారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయం, ఆర్బీకే, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్‌తో పాటు సీసీ రోడ్డు, డ్రైనేజీలను ప్రారంభించనున్నారు. అలాగే మండల కేంద్రమైన గడివేములలోని పొదుపు కార్యాలయం ఆవరణలో ఆసరా వారోత్సవాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏపీఎం హజరత్ తెలిపారు. మండలంలో 597 గ్రూపులకు గాను 7,164 సభ్యులకు రూ.2.12 కోట్ల మెగా చెక్కును ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు అందించనున్నారు. కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.



ముస్తాబైన గ్రామ సచివాలయం

**పాణ్యం:** మండల పరిధిలోని కొండజుటూరు గ్రామంలో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి బుధవారం పర్యటించనున్నట్లు జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి మంగళవారం తెలిపారు. గ్రామంలోని ఓహెచ్‌ఆర్, రైతు భరోసా కేంద్రం, బీ.టీ రోడ్డు, ఎస్సీ కాలనీలో సీసీ రోడ్లు ప్రారంభిస్తారని చెప్పారు. మధ్యాహ్నం 3 గంటలకు కార్యక్రమం ఉంటుందన్నారు.





గూడూరు రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న కుడా చైర్మన్ కోట్ల హర్ష, ఇన్‌చార్జ్ డా.సతీష్, వర్కూరులో తూము పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

## ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం

- పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాల వర్తింపు
- కుడా చైర్మన్ కోట్ల హర్ష, ఇన్‌చార్జ్ డాక్టర్ సతీష్

**కోడుమూరు రూరల్ :** ప్రజా సంక్షేమం, అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమాన ప్రాధాన్యత నిస్తూ పాలన సాగిస్తున్నారని కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి తెలిపారు. పార్టీలు, కులమతాలకు అతీతంగా పేదలందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేసిన ఘనత సీఎం జగనన్నకే దక్కిందన్నారు. కోడుమూరులో రూ.6.74కోట్లతో నిర్మిస్తున్న గూడూరుకు రోడ్డు నిర్మాణానికి, వర్కూరులో ఎల్ఎల్‌సీ కాల్వపై తూము ఏర్పాటు, ఎస్సీ కాలనీలో మంచినీటి పైపులైను నిర్మాణానికి మంగళవారం గూడూరు, కోడుమూరు ఎంపీపీలు సునీత, గాడి రూతమ్మ, జెడ్పీటీసీలు రఘునాథ్‌రెడ్డి, మౌలాలి, ప్రసన్నకుమార్‌లతో కలిసి కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ కోడుమూరు ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ భూమి పూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక వైపు ప్రజలందరికీ సంక్షేమ పథకాలను అందజేస్తూ మరోవైపు ప్రజలకు అవసరమైన విద్య, వైద్యం, రోడ్లు వంటి మౌలికవసతులను కల్పిస్తున్నారన్నారు. రాష్ట్రంలో జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక చంద్రబాబు లేనిపోని విమర్శలు చేస్తూ ప్రజలను పక్కదోవ పట్టించేందుకు యత్నిస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు చెప్పే మాయ మాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. వచ్చే ఎన్నికల్లో సంక్షేమ ఫలదాత జగనన్నకు మరోసారి ప్రజలంతా పట్టం కట్టాలని కోట్ల హర్ష కోరారు. వైఎస్సార్‌సీపీ హయంలోనే నియోజకవర్గంలో అభివృద్ధి పనులు జరిగాయని, సుమారు రూ.200కోట్ల నిధులతో మారుమూల గ్రామాలకు సైతం రోడ్లు వేయడంతో పాటు, ఆయా గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలు జరిగాయన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఎలాంటి విభేదాలు లేవని, వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం కలిసికట్టుగా పనిచేస్తామన్నారు. రైతులంతా కలిసికట్టుగా ఎల్ఎల్‌సీ కాల్వపై తూము ఏర్పాటు చేసుకునేందుకు ముందుకు రావడం హర్షించదగ్గ వియమన్నారు. ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సతీష్ మాట్లాడుతూ కల్లబొల్లి మాటలు చెప్పే చంద్రబాబును ప్రజలెవ్వరూ నమ్మే స్థితిలో లేరన్నారు. జగనన్న ఆశయ సాధనకు తామంతా కలిసికట్టుగా పనిచేస్తామని, వైఎస్సార్‌సీపీ గెలపే లక్ష్యమమన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షుడు క్రిష్టారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు విజయ్ కుమార్‌రెడ్డి, సర్పంచ్‌లు శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వరమ్మ, లక్ష్మిదేవి, ఎంపీటీసీలు రంగయ్య, హనుమంతు, ఉపసర్పంచు మాదులు, మాజీ ఉపసర్పంచు ప్రవీణ్‌కుమార్, వైసీపీ మండల కన్వీనర్ రమేష్‌నాయుడు, స్థానిక నాయకులు ఈశ్వర్‌రెడ్డి, చనుగొండ్ల ప్రతాప్‌రెడ్డి, రవికుమార్‌రెడ్డి, లద్దగిరి బందెనవాజ్, లింగన్న, రాఘవేంద్ర, దస్తగిరి, కర్ణ, రామచంద్ర, మౌలాలి, పాలదస్తగిరి, మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

### గ్రామాలలో తహసీల్దార్ పర్యటన



ముడుమాల రెగ్యులర్ స్కూల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ అనుపమ

**సి.బెళగల్:** మండలంలోని కొత్తకోట, కె.సింగవరం, ఈర్లదిన్నె, ముడుమాల గ్రామాలలో మంగళవారం తహసీల్దార్ అనుపమ పర్యటించారు. పోలింగ్ కేంద్రాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాలను తనిఖీచేసి ఓటర్లకు, సిబ్బందికి అవసరమైన వసతులు, సౌకర్యాలు, సమస్యలను నమోదు చేసుకున్నారు. అదేవిధంగా పాఠశాలలో ప్రభుత్వం అందజేస్తున్న విద్యా సంబంధ పథకాల అమలు, విద్యార్థులకు చేరుతున్న విషయాలను విద్యార్థులు, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ముడుమాల గ్రామ రెగ్యులర్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి పరిశుభ్రతను పాటించాలని ఉపాధ్యాయులకు, భోజన నిర్వాహకులకు సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసిన తహసీల్దార్ బాలలకు అందుతున్న పౌష్టికాహారంపై అంగన్‌వాడీ వర్కర్లకు సూచనలు చేశారు.

### దామోదరం సంజీవయ్య జయంతి

**కర్నూలు(అర్బన్):** ఏపీసీసీ అధ్యక్షులు, తొలి దళిత ముఖ్యమంత్రి స్వర్గీయ దామోదరం సంజీవయ్య జయంతిని ఈ నెల 14వ తేదీన ( నేడు ) ఘనంగా నిర్వహించనున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ జె. రంగలక్ష్మీదేవి తెలిపారు. స్థానిక నంద్యాల చెక్‌పోస్టులో ఉన్న దామోదరం విగ్రహానికి ముందుగా పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన అనంతరం అక్కడే జయంతి సభ నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా కలెక్టర్ డా. జి. సృజన అధ్యక్షతన నిర్వహించనున్న ఈ కార్యక్రమాల్లో జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని జేడీ కోరారు.

## వైద్య విద్యా బోధనపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

- హెచ్‌వోడీలు, ప్రొఫెసర్లతో సమీక్షలో ఆసుపత్రి సూపరింటెండెంట్



మాట్లాడుతున్న డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి

**కర్నూలు(హాస్పిటల్):** కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో వైద్య విద్యా బోధన పై ఆచార్యులు ప్రత్యేక శ్రద్ధ చూపించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి ఆదేశించారు. మంగళవారం ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో ఆరోగ్యశ్రీ, ఈ–హాస్పిటల్ తదితర విషయాలపై హెచ్‌వోడీలు, ప్రొఫెసర్లతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలో పలు విభాగాల్లో ఆరోగ్యశ్రీకి సంబంధించి ప్రతి వారం ఇచ్చే లక్ష్యాలను పీడియాట్రిక్, జనరల్ సర్జరీ, జనరల్ మెడిసిన్ విభాగాలు బాగా చేశాయని అభినందించారు. ఆసుపత్రిలోని అన్ని విభాగాల్లో ఈ–హాస్పిటల్ అమలు బాగా జరుగుతోందని కొనియాడారు. ఆసుపత్రి, మెడికల్ కాలేజీలో వైద్య విద్యార్థుల తరగతి హాజరు, విద్యా బోధనపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని చెప్పారు. ఆసుపత్రిలోని సర్జికల్ అంకాలజీ, మెడికల్ అంకాలజీ, రేడియేషన్ అంకాలజీలకు ప్రత్యేకంగా ఓపీలు ఇవ్వాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. ఎఫ్‌ఎంసీ విభాగంలో మెడికల్ అంకాలజీ 10 పడకలతో ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. అన్ని విభాగాల్లో వైద్యుల హాజరు రిజిస్టర్‌ను పక్కాగా అమలు చేయాలన్నారు. సమావేశంలో కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ పి. సుధాకర్, వైస్ ప్రిన్సిపాల్ హరిచరణ్, సీఎస్‌ఆర్‌ఎంవో బి. వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్‌ఆర్‌ఎంవో డాక్టర్ హేమనళిని, డాక్టర్ రాధారాణి, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ ఇక్బాల్ హుసేన్, డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ శివబాలనాగాంజన్, డాక్టర్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

**ఆసుపత్రిలో మరణాలపై సమీక్ష**

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో నెలవారీ మరణాల గురించి మంగళవారం కర్నూలు మెడికల్ కాలేజీలోని న్యూ లెక్చర్ గ్యాలరీలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా మరణాలతో పాటు జనరల్ మెడిసిన్, గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాల్లో రెండు కేస్ షీట్‌లపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. కార్యక్రమంలో కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సుధాకర్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిచరణ్, సీఎస్‌ఆర్‌ఎంఓ డాక్టర్ బి. వెంకటేశ్వరరావు, డాక్టర్ రేణుకాదేవి, డాక్టర్ ఇక్బాల్ హుసేన్, డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ విజయానందబాబు, డాక్టర్ శ్రీనివాసులు, ఆర్‌ఎంవో డాక్టర్ వెంకటరమణ పాల్గొన్నారు.

## ఘనంగా సరోజినీ నాయుడు జయంతి

**కర్నూలు కల్చరల్:** క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలోని సిల్వర్‌జూబ్లీ ప్రభుత్వ కళాశాలలో మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో మంగళవారం సరోజినీ నాయుడు జయంతిని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ సుబ్రహ్మణ్య కుమార్ అధ్యక్షత వహించి మాట్లాడారు. సరోజినీ నాయుడు జయింతిని రోజును జాతీయ మహిళా దినోత్సవంగా జరుపుకుంటామన్నారు. నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. దేశం అభివృద్ధి చెందాలంటే ప్రతి ఒక్క మహిళా దృఢమైన ఆత్మవిశ్వాసంతో ముందుకు రావాలన్నారు. ఉమెన్ ఎంపవర్‌మెంట్ కో–ఆర్డినేటర్ డాక్టర్ విక్టర్ భాను మాట్లాడుతూ సరోజినీ నాయుడు జీవితాన్ని ప్రతి మహిళ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. మహిళా సాధికారతపై కవితల పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ ఫామిదాబేగం, డాక్టర్ షానవాజ్, డాక్టర్ స్వప్నశ్రీ, పార్వతి, విద్యార్థులు పాల్గొన్నారు.